
కామెడీ కథ

కోలపల్లి ఈశ్వర్




# ఏడ్చినట్టే ఉంది

రాజేశ్వరరావ్‌కి చిన్న పనిపడి హడావుడిగా రాఘవ ఇంటికి వెళ్లాడు.

ఇతను వెళ్లేసరికి అతను జుట్టుపీక్కుంటూ అసహనంగా కనిపించాడు.

"ఎందుకలా తీవ్రంగా జుట్టు పీక్కుంటున్నావ్?" ఆశ్చర్యంగా అడిగాడు రాజేశ్వరరావ్ మిత్రుడికెదురుగా ఖాళీగా వున్న ఓ కుర్చీలో కూర్చుంటూ.

"ఇంతకుముందు దాకా ఘోరాతిఘోరంగా నెత్తి బాదుకున్నాను. చేతులు నొప్పెట్టటంవల్ల జస్ట్, ఇప్పుడే జుత్తుపీక్కోవడం ప్రారంభించాను" ఆవేదనగా ముఖంపెట్టి చెప్పాడు రాఘవ.

"అలా నెత్తిబాదుకొని జుత్తుపీక్కోవాల్సినంత విషాద సంఘటన ఏం జరిగింది?" రాజేశ్వరరావ్ కుతూహలంగా అడిగాడు, ముఖాన్ని మాత్రం విషాదంగా పెట్టి.

"ఏమని చెప్పుదు నా బాధ? మూడొందలు పోయాయి" కన్నీరయితే నింపుకోలేదు గానీ ఏడుపుగొంతుకతోనే అన్నాడు రాఘవ.

వాళ్లిద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్న చిరుద్యోగులు. పెళ్లిళ్లయ్యాయి గానీ ఇద్దరికీ పిల్లల్లేరింకా!

పిల్లల్లేకున్నంత మాత్రాన ఒక చిరుద్యోగికి మూడొందలంటే చిన్న మొత్తమేం కాదుగదా!

"బాప్‌రే బాప్...మూడొందలే! ఎక్కడ పోయాయ్? ఎలా పోయాయ్?" అడిగాడు రాజేశ్వరరావ్ కొంచెం గాభరాగా- గాభరాని తెలియనివ్వకుండా.

"పోస్టాఫీసు దారిలో.." నిట్టూర్చాడు రాఘవ.

"అలాగా..బ్యాడ్‌లక్..ఏం చేస్తాం. ఊరుకో..అరెరె..అన్నట్టు రూమ్‌కి తాళం వేసి రావడం మర్చిపోయినట్టున్నాను. ఇప్పుడే గుర్తొచ్చింది. మళ్లీ వస్తానుండు" అనేసి మిత్రుడి అనుమతి కోరకనే ఒక్క ఉదుటన కుర్చీలోంచి లేచి వీధిలోకి పరుగుతీశాడు రాజేశ్వరరావ్.

* * *

రోడ్డుమీద ఏదో వెదుక్కుంటూ నడుస్తున్న రాజేశ్వరరావ్‌ని "ఏం పోయిందండీ?" అనడిగాడో వ్యక్తి.

"మూడొందలు పోయాయ్" ఇంకా వెదుకుతూనే చెప్పాడు రాజేశ్వరరావ్.

"ఎంతసేపైంది పోయి?"

"జస్ట్ ఇందాకేనండీ..పోస్టాఫీసుకు వెళ్లి వస్తుంటే..దార్లో ఎక్కడో పడిపోయాయ్"

"ఇందాకటి సంగతంటున్నారు. ఇప్పటిదాకా ఉంటాయా? అందులో ఇది రద్దీ ఏరియా! అది సరేగానీ యాభైలా? వందలా?" అతనడిగాడు.

ఆ వ్యక్తి అలా ఆరాలడుగుతుంటే..కొంపదీసి వీడిగ్గానీ దొరికాయా? అనుకున్నాడు రాజేశ్వరరావ్.

యాభైలో, వందలో ఎలా చెప్పటం?

ఆ వివరాలు తానసలు రాఘవనడిగిందెక్కడ? అదృష్టం బాగుండి తనగ్గనక దొరికితే 'నొక్కేయచ్చు' కదాని వెంటనే ఇలా పరుగెత్తుకుంటూ వచ్చేశాడాయె.

అందుకే "అంటే..పదులుగానీ, యాభైలుగానీ, వందలుగానీ కావచ్చండీ.." అన్నాడు - నేలమీదనుండి చూపుమరల్చకుండానే రాజేశ్వరరావ్.

"అదేంటలా అంటున్నారు? మీరు పారేసుకున్నవి ఏ నోట్లో మీకే తెలియదా?" కించిత్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడా వ్యక్తి - రాజేశ్వరరావ్‌తో పాటూ వెదుకుతూ.

ఇంత పర్టిక్యులర్‌గా వివరాలడుగుతున్నాడూ అంటే - ఆ డబ్బు ఇతనికి కచ్చితంగా దొరికే ఉంటుంది అనుకున్న రాజేశ్వరరావ్ బుర్ర పాదరసంలా పనిచేసింది.

"డబ్బు పోగొట్టుకున్నది నేను కాదండీ... మా ఫ్రెండు. కానీ, వాడికి చూపు సరిగా ఆనదు. పగటి చీకటి..అందుకే వెతికి రమ్మని నన్ను పంపించాడు. అవి ఏ నోట్లో అన్నది నేనూ వాడిని అడగటం మర్చిపోయాను. అంచేత అవి ఏ నోట్లయినప్పటికీ మీగ్గనక ఆ మూడొందలు దొరికుంటే దయచేసి ఇచ్చేయండి. ప్లీజ్.." బుర్ర పాదరసంలా పనిచేయడంవల్ల అప్పటికప్పుడు ఓ అద్భుతమైన అబద్ధం ఆడేసి 'మీదే ఆలస్యం' అన్నట్టుగా చెయ్యి కూడా అతని ముందుకు చాచాడు.

"అబ్బే..నాకేం దొరకలేదండీ..మీరు దేని గురించో వెతుకుతుంటే ఊరకనే వివరాలు అడిగాను. అంతే..వస్తానండీ.." అనేసి తనదారిన తాను సాగిపోయాడా పెద్దమనిషి వెనక్కితిరిగి చూస్తూ.

"ఏడ్చినట్టే వుంది" అని గొణుక్కుని, తన అన్వేషణను కొనసాగిస్తూ అలా అలా పోస్టాఫీసుకి చేరుకున్నాడు రాజేశ్వరరావ్ ఆశ చావక.

కానీ, పైకం దొరికి చావలేదు.

'నీ వెర్రిగానీ, రోడ్డుమీద పారేసుకున్న డబ్బులు మళ్ళీ దొరుకుతాయా? చరిత్రలో ఎక్కడన్నా జరిగిందా?' అని ఎగతాళి చేసింది అతని అంతరాత్మ.

'దొరక్కూడదని రూలేం లేదు. అదృష్టం బాగుంటే దొరకొచ్చు కూడా' అంతరాత్మని గదమాయించి, మళ్లీ అన్వేషిస్తూనే పోస్టాఫీసు నుంచి రాఘవ ఇంటికి తిరుగుముఖం పట్టాడు రాజేశ్వరరావ్.

బ్యాడ్‌లక్.. కాళ్ల తిప్పటే మిగిలింది తప్ప పోయిన పైకం మాత్రం దొరికి చావలేదు.

అతను నీరసంగా రాఘవ వాళ్ల ఇల్లు చేరుకునేసరికి- "మూడొందలు పోయినట్టేనని ఎంతో బాధపడ్డాను రమా! కానీ, అదృష్టం. గుప్పెడు జుట్టు ఊడితే ఊడింది గానీ మొత్తానికి గుర్తొచ్చింది.." అంటూ ఉన్నాడు రాఘవ తన భార్యామణితో.

అది విని గతుక్కుమన్నాడు రాజేశ్వరరావ్.


"ఏంటీ ఆ పైకం దొరికిందా? ఇంట్లోనే ఎక్కడో పెట్టి మర్చిపోయి పోయిందనుకున్నావన్నమాట" అంటూ లోపలికి ప్రవేశించాడు రాజేశ్వరరావ్.

"పైకం పోవడం ఏమిట్రా?" అంటూ ఘొల్లున నవ్వి అప్పుడు చెప్పాడు రాఘవ అసలు విషయం.

"ఇందాక నేనొక కథ రాసి పోస్ట్ చేయడానికి పోస్టాఫీసుకి వెళ్తొస్తుంటే మరో కొత్తకథకి సడన్‌గా ఫ్లాష్‌లా ఓ ఐడియా వచ్చింది. తీరా ఇంటికొచ్చేసరికల్లా ఆ ఐడియా ఏమిటో మర్చిపోయాను. ఎంత బుర్రబద్దలు కొట్టుకున్నా గుర్తురాలేదు. జుట్టు పీక్కున్నాను. అయినా లాభం లేకపోయింది. ఆ ఐడియాని కథగా రాస్తే కచ్చితంగా అచ్చయ్యి, నాకో మూడు వందల రూపాయల్ని పారితోషికంగా తెచ్చిపెడుతుంది. అంటే....సీనియర్ రచయితలకి ఎక్కువిస్తారనుకో...అఫ్‌కోర్స్... నాలాంటి నవయువ రచయితలకు మూడొందలు కంపల్సరీగా ఇస్తారు. అందుకే ఇందాక నీతో అలా అన్నాను. మూడొందల రూపాయలు పోయాయని. నువ్వలా వెళ్లగానే, మరికాస్త జుట్టు పీక్కుంటుండగా గుర్తొచ్చేసింది నాకా ఐడియా ఏమిటో..అద్సరే..ఇంటికి తాళం వేయలేదంటూ వెళ్లావ్. మీ ఆవిడింకా పుట్టింటి నుంచి రాలేదా? ఇల్లూ అదీ జాగ్రత్తగా చూసుకోమరి. హోటల్లో తిండేనా- చెయ్యేమైనా కాల్చుకుంటున్నావా?"

చిరుద్యోగి కమ్ చోటా రచయిత అయిన మిత్రుడు అలా అడుగుతుంటే-

"ఆ..ఆ..ఏదో అలా..ఇవాళ సాయంత్రం తను వచ్చుద్ది" అంటూ పీలగొంతుతో జవాబు చెప్పి పేలవంగా నవ్వాడు రాజేశ్వరరావ్.



## నిఖిత క్రేజ్!

తెలుగులో ఫ్లాపయి, తమిళంలో హిట్ అయిన హీరోయిన్‌ల జాబితాలోకి నిఖిత కూడా చేరిందిప్పుడు. ఇటీవలే ఓ ఐటమ్ నంబర్ ద్వారా తమిళ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన నిఖితకి తెగ క్రేజ్ వచ్చిపడిందిట ఇప్పుడు. వచ్చే న్యూయియర్ ఈవెంట్స్‌లో ఆమె షోలకోసం తెగ డిమాండ్ ఏర్పడిందిట. షోకి పది లక్షల వరకూ ఇవ్వడానికి సైతం నిర్వాహకులు రెడీ అవుతున్నారట. అలాగే సినిమాల్లోనూ నిఖితకు మంచి ఆఫర్లు వస్తున్నాయిట. దేనికైనా టైమ్ రావాలంటారు ఇందుకే మరి.